నమస్తే తెలంగాణ

నల్లగొండ

5 | నల్లగొండ, గురువారం 26 డిసెంబర్ 2024 | NALGONDA


# రోజంతా చిరుజల్లులు

- అల్పపీడనం ప్రభావంతో ముసురు
- తగ్గిన ఉష్ణోగ్రతలు

నల్లగొండ, డిసెంబర్ 25 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం చిరుజల్లులు కురిశాయి. రోజంతా ముసురు పెట్టింది. ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాయంత్రం వరకు 21 డిగ్రీల నుంచి 24 డిగ్రీల మధ్యలో నమోదయ్యాయి. అత్యధికంగా కట్టంగూర్ మండలంలో 2.3 మిల్లీమీటర్ల వర్షం కురువగా, నార్కట్‌పల్లిలో 2.0, తిప్పర్తిలో 1.8, నకిరేకల్, పీఏపల్లి, నల్లగొండ, అనుముల, మర్రిగూడ, తిరుమలగిరి సాగర్, మాడ్గులపల్లి, చండూరు మండలాల్లో 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిడమనూరు, పెద్దవూర, త్రిపురారం, గుర్రంపోడు, శాలిగౌరారం మండలాల్లో 1.0 మిల్లీమీటర్ల వర్షం పడింది. మిగిలిన మండలాల్లో 0.5 మి.మీ. నుంచి 0.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



సూర్యాపేట గ్రేస్ చర్చిలో కేకు కట్ చేసి పాస్టర్‌కు తినిపిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# అందరికీ రైతు భరోసాపై నీలినీడలు

## కోతలు పెట్టేందుకు సర్కారు యత్నాలు





- లబ్ధిదారుల సంఖ్యను వీలైనంత కుదించేలా చర్యలు
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విధానాల వైపు మొగ్గు
- ఇదే జరిగితే ఉమ్మడి జిల్లాలో సగానికి తగ్గిపోనున్న రైతుల సంఖ్య
- పంట వేస్తే ఇస్తామంటే మరింతమంది దూరం
- యాసంగిలో మెట్ట పంటల రైతులకూ లేనట్లేనా?
- యథావిధిగా అందరికీ ఇవ్వాలంటున్న రైతులు

ఎన్నికల ముందు అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న విధానాలకు పొంతన ఉండడం లేదు. ఆనాడు అధికారం కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చి ఓట్లను కొల్లగొట్టి... ప్రస్తుతం అదే ఓటర్లకు మొండిచెయ్యి చూపుతున్నది. అందరికీ 2 లక్షల వరకు రుణమాఫీ అని ఆర్భాటంగా ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరా అమలుకు వచ్చే సరికి సగానికి సగం కోత పెట్టింది. ఇప్పటికీ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనీసం రెండున్నర లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఐదు నెలలుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎకరాకు రూ.15వేల పంట సాయం ఇచ్చే రైతు భరోసా పథకంపైనా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా వారు ప్రకటించిన రైతు భరోసా అందలేదు. గత యాసంగిలో అమలు చేసినా, కేసీఆర్ సర్కార్ ఇచ్చిన రైతుబంధు పథకాన్నే ఎకరాకు రూ.5వేల చొప్పున ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. వానకాలం నుంచి ఎకరాకు ఒక్కో సీజన్‌కు రూ.7,500 ఇస్తామని చెప్పి అసలుకే ఎసరు పెట్టారు. ఇప్పుడు యాసంగి పంట కాలానికి సంక్రాంతి తర్వాత ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసినా ఎంతమందికి ఇస్తారు, అందరికీ ఇస్తారా, లేదా అనే సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. గ్రామాల్లో ఏ ఇద్దరు రైతులు కలిసినా రైతు భరోసా ఇచ్చేనా? ఇస్తే ఎన్ని ఎకరాల వరకు ఇస్తారు? ఎవరికి కోత పెడుతారు? అన్న చర్చ నడుస్తున్నది.

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ)

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఎకరానికి రూ.15వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్తే పెట్టుబడి సాయం పెరుగుతుందని రైతులు ఆశ పడ్డారు. కానీ ఇచ్చే మొత్తం పెంచుతూనే నిబంధనల పేరిట సగానికి సగం మంది రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని రాజకీయ, రైతు సంఘాల నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల చివరి రోజున రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ పెట్టి తుది నిర్ణయం ప్రకటించకుండానే వదిలేశారు. ఈ చర్చలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తావించడంతో రైతు భరోసాలో లబ్ధిదారుల కోత తప్పదని భావిస్తున్నారు. ప్రభుత్వ తీరును పరిశీలిస్తే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఎవరికైతే వర్తిస్తుందో అదే రైతులకు రైతుభరోసాను అమలు చేస్తారన్నది ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. ఇదే జరిగితే రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్య సగానికి సగం తగ్గిపోతుంది.

### పంట వేయకుంటే అంతే సంగతులు...

వానకాలంలో సాగుచేసి యాసంగిలో సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వరన్న చర్చ ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తున్నది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల అసెంబ్లీలో సభ్యులకు అందించిన వివరాల్లో యాసంగిలో పంటలు వేయని భూములను సాగులో లేని భూముల కింద చూపించినట్లు సమాచారం. ఇదే జరిగితే రైతు భరోసాకు మెట్ట భూముల రైతులంతా దూరం కానున్నారు. సాధారణంగా జిల్లాలో వరి, పండ్ల తోటలు మినహా మిగతా పంటలన్నీ వానాకాలంలోనే సాగు చేస్తారు. పత్తి, జొన్న, ఇతర మెట్ట పంటలను ఏడాదిలో ఒకేసారి సాగు చేస్తారు. సంక్రాంతి వరకు ఈ పంటల దిగుబడి పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పంట వేయని రైతులకు భరోసా లేదంటే ఇప్పటి వరకు రైతుబంధు పొందిన రైతుల్లో 70 శాతం మంది అనర్హులు కానున్నారు. ఇదే జరిగితే ప్రభుత్వం ఇచ్చే రైతుభరోసా ఏ కొద్దిమంది రైతులకో అందతుంది. జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే... రుణమాఫీ మాదిరిగానే రైతు భరోసాకు సైతం ప్రభుత్వం కోతలు పెడుతుందన్న భయం రైతులను వెంటాడుతున్నది. భూమి ఉన్న ప్రతీ రైతునూ సాగు వైపు మళ్లించాలని, తద్వారా బీడు భూములను సైతం సాగులోకి తేవాలని, పంటల దిగుబడిని ప్రోత్సహించాలని 24 గంటల ఉచిత కరెంటు, సాగు నీటికి తోడు రైతుబంధు కూడా అందిస్తే వ్యవసాయం పండుగలా మారుతుందని అప్పటి కేసీఆర్ సర్కార్ నిరూపిస్తే... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవేమీ పట్టకపోవడం గమనార్హం. కేవలం రుణమాఫీని, రైతుభరోసా వంటి పథకాలను ఆర్థిక పరమైన అంశాలుగానే భావిస్తూ భారం తగ్గించుకునేందుకు మాత్రమే ఆలోచిస్తుండడం పట్ల రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ రంగ నిపుణులు మండిపడుతున్నారు. ఎలాంటి షరతులూ లేకుండా గతంలో మాదిరిగానే ప్రతి రైతుకూ రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### లబ్ధిదారుల సంఖ్య కుదింపుపై కసరత్తు

అందరికీ రుణమాఫీ అని ముందుగా ప్రకటించి తీరా అమలులోకి వచ్చే సరికి రేషన్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగులు, రెండు లక్షలకు పైగా లోన్ ఉంటే అనర్హులు అనే నిబంధనలతో భారీగా కోతలు పెట్టారు. దాంతో ఉమ్మడి జిల్లాలో కనీసం రెండున్నర లక్షల మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. ఇప్పుడు ఇదే తరహాలో రకరకాల నిబంధనలతో రైతు భరోసాను కొందరికే పరిమితం చేసే చర్యలను కాంగ్రెస్ సర్కారు వేగవంతం చేస్తున్నది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలే రైతు భరోసాకు వర్తింపజేస్తే రాష్ట్రంలో దాదాపు గతంలో 70 లక్షల మందికి ఇచ్చిన రైతుబంధును ప్రస్తుతం 30 లక్షల మందికే భరోసా రూపంలో ఇస్తే సరిపోతుందని అంచనా. బీఆర్ఎస్ పాలనలో ప్రతి సీజన్‌కు కేసీఆర్ సర్కారు సుమారు 12 వేల కోట్ల వరకు రైతుబంధు ద్వారా ఇస్తే.. ఇప్పుడు రూ.7,500 కోట్లు సరిపోతాయని కాంగ్రెస్ సర్కారు అంచనా వేస్తున్నట్లు సమాచారం. ఇందుకు ఇటీవల అసెంబ్లీలో రైతు భరోసాపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు సరిపోలుతున్నాయి. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... గుట్టలు, బండరాళ్లు, రోడ్లకు రైతుబంధు ఇచ్చారంటూ చేసిన వ్యాఖ్యలు కుదింపునకు సంకేతాలేనని రైతు సంఘం నాయకులు అభిప్రాయపడుతున్నారు. రైతు భరోసా పథకంలో కోతలను ముందే కవర్ చేసుకునేలా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ లెక్కన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనీసం సగానికిపైగా లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోవచ్చని అంచనా వేస్తున్నారు. కేసీఆర్ సర్కారులో ఉమ్మడి జిల్లాలో సుమారు 11 లక్షల మంది రైతులకు ఒక్క సీజన్‌లో రూ.1,300 కోట్ల వరకు పెట్టుబడి సాయంగా రైతు బంధు డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. నిజంగా ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు ఎకరాకు రూ.7,500 చొప్పున రైతు భరోసా ఇవ్వాల్సి వస్తే ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లోనే కనీసం రూ.2వేల కోట్లు రైతులకు చెందాల్సి ఉంటుంది. కానీ అటూఇటుగా ఈ సీజన్‌లో రూ.700 నుంచి 800 కోట్ల వరకు ఇస్తే గగనమని ప్రభుత్వ చర్యలను బట్టి తెలుస్తున్నది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలను అమలు చేస్తే ఇంట్లో ఒక రైతుకు మాత్రమే రైతు భరోసా వర్తించనుంది. ఒక కుటుంబంలో ఇద్దరు ముగ్గురు రైతుల పేర్లపై భూమి ఉంటే అందులో ఒక్కరికే రైతుభరోసా ఇచ్చే అవకాశం ఉంది. రుణమాఫీ మాదిరిగానే కనీసం రెండేండ్లు ఐటీ కట్టిన వారికి రైతు భరోసా రాకపోవచ్చు. ఇక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్చర్లు, ఇతర ప్రొఫెషనల్ వ్యక్తులకు సైతం రైతు భరోసా వర్తించకపోవచ్చు.

# యేసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయం

- అన్ని మతాలకు ప్రాధాన్యత పెంచిన ఘనత కేసీఆర్‌దే
- క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట టౌన్, డిసెంబర్ 25 : యేసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన క్రైస్తవులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో జగదీశ్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాల ప్రధాన పండుగలను అధికారికంగా నిర్వహిస్తూ వాటి ప్రాధాన్యతను పెంచిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. పదేండ్లుగా ఆయా మతాల ప్రధాన పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటూ మరింత ఐక్యతను పెంచామని తెలిపారు. క్రిస్మస్, రంజాన్, దసరా పండుగలకు ప్రత్యేక విందులు, దుస్తులు, సామగ్రిని పంచుతూ గంగా జమున తహజీబ్‌లకు నిలయంగా తెలంగాణ సమాజాన్ని తయారు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు.



నుజ్జునుజ్జయిన కారును పరిశీలిస్తున్న పోలీసులు

# దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తా

## భువనగిరిలో ఇద్దరు మృతి.. మరో ఐదుగురికి గాయాలు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 25 : దైవదర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. ప్రమాదవశాత్తు కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పరిధిలో బుధవారం జరిగింది. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లోని పలు కాలనీలకు చెందిన శ్రీను, అర్జున్, మితిన్ రామంతాపూర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. మణిజయంత్, యశ్వంత్ నారాయణగూడలోని నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాగా, బుదవారం క్రిస్మస్ సెలవు కావడంతో యాదగిరిగుట్టకు వెళ్లాలనుకున్నారు. అదే కాలనీకి చెందిన మహ్మద్ అబ్దుల్ సుఫ్యాన్ ఇన్నోవా కారును అద్దెకు తీసుకుని యాదగిరిగుట్టకు దైవదర్శనానికి వెళ్లారు. దర్శనం తర్వాత తిరుగు ప్రయాణంలో ఓ హోటల్లో టిఫిన్ చేశారు. అనంతరం భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి క్షేత్రాన్ని దర్శించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో భువనగిరి పట్టణ పరిధిలోని బొమ్మాయిపల్లి చౌరస్తా సమీపంలో కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మహ్మద్ అబ్దుల్ సుఫ్యాన్(25), యశ్వంత్(17) అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న అర్జున్, నితిన్, శ్రీను, మణిజయంత్, కారు డ్రైవర్ వెంట వచ్చిన 9వ తరగతి విద్యార్థి షాకిబ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గాయాలైన వారిని 108 వాహనంలో భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

# వర్షంలోనూ సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నల్లగొండ, డిసెంబర్ 25 : తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లగొండ కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 16వ రోజూ కొనసాగింది. బుధవారం వర్షంలో గొడుగులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొల్గూరి కృష్ణ, బొమ్మగాని రాజు మాట్లాడుతూ 16 రోజులుగా విధులు బంద్ చేసి సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి రెగ్యులర్ చేస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు గుమ్మల మంజుల, కోశాధికారి పుష్పలత, ముఖ్య సలహాదారు నీలాంబరి, నాయకులు పుష్పలత, సావిత్రి, యాదయ్య, సాయిలు, వెంకన్న, నాగయ్య, వెంకటకృష్ణ, గిరిధర్, నాగభూషణంచారి, శ్రీనివాసులు, మోయిజ్‌ఖాన్, జానయ్య, భిక్షం, సైదులు, నాగరాజు పాల్గొన్నారు.


# నలుగురు అంగన్‌వాడీ టీచర్ల సస్పెన్షన్

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 25 : పోషకాహారం పంపిణీలో అవకతవకలు, అవినీతికి పాల్పడిన నలుగురు అంగన్‌వాడీ టీచర్లను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న భువనగిరి పట్టణంలోని చీమల నరేశ్‌కు చెందిన పశువుల పాకలో 9బస్తాల్లో 180కిలోల బాలామృతం ఉన్నట్లు అందిన సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు తనిఖీ చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నరేశ్‌ను విచారించగా మోత్కూరుకు చెందిన బాలామృతం పంపిణీదారుడు బీసు ప్రశాంత్ దగ్గర తీసుకున్నట్లు చెప్పాడు. దాంతో ఎస్‌ఓటీ పోలీసులు ప్రసాద్ ఇంటిపై ఆకస్మిక దాడి చేసి 100కిలోల బాలామృతం, 48లీటర్ల పాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణికి పోలీసులు తెలియజేశారు. విచారణ చేపట్టి ఆలేరు ప్రాజెక్టు పరిధిలోని మంతపురి, పుట్టగూడెం, యాదగిరిగుట్ట–3, మోత్కూరు ప్రాజెక్టు పరిధిలోని మోత్కూరు అంగన్‌వాడీ కేంద్రం–7కు చెందినవిగా గుర్తించారు.

అదనపు కలెక్టర్ గంగాధర్ మోత్కూరు, ఆలేరు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాల పంపిణీ రికార్డులను పరిశీలించగా.. లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా ఆన్‌లైన్‌లో పంపిణీ జరిగినట్లుగా రికార్డుల్లో చూపించినట్లు తేలింది. దాంతో కలెక్టర్ సంబంధిత అంగన్‌వాడీ టీచర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి విచారణకు ఆదేశించారు.

# 'భువనగిరి ట్రిపుల్ ఆర్' పై ముందుకే..

## భూ నిర్వాసితులకు బహిరంగ నోటీసు




- పెండింగ్ భూములపై త్రీజీ నోటిఫికేషన్ విడుదల
- గతంలో 70 హెక్టార్లకు.. తాజాగా 26హెక్టార్లకు..
- 27 నుంచి 30వరకు ఆర్డీఓ ఆఫీసులో సమావేశాలు
- రైతుల భూములు, ప్లాట్ల వివరాల సేకరణ
- పోరాటం ఆపేది లేదంటున్న ట్రిపుల్ ఆర్ బాధితులు
- ఇప్పటికే గల్లీ నుంచి ఢిల్లీ వరకు గళం

రీజనల్ రింగ్ రోడ్డుపై సర్కారు ముందుకే వెళ్తున్నది. భువనగిరి ఆర్డీఓ పరిధిలో త్రీజీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్‌హెచ్‌ఏఐ బహిరంగ ప్రకటన రిలీజ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 27నుంచి 30 వరకు భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో భూ నిర్వాసితులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లోనే త్రీజీ విడుదల చేయగా, పెండింగ్ భూములపై మరో త్రీజీ నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. మరోవైపు భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ)

### ప్రాజెక్ట్ స్వరూపం ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భారత్ మాల పరియోజన కింద రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మించనున్నాయి. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్ ప్రకారం ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం మొత్తం సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 19 మండలాల పరిధిలోని 113 గ్రామాల మీదుగా వెళ్తున్నది. ప్రాజెక్టును ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించారు. ఉత్తర భాగంలో యాదాద్రి భువనగిరి జిల్లా మీదుగా 59.33 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నారు. దీని పరిధిలో తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాలు ఉన్నాయి. సుమారు 2వేల ఎకరాల భూమిని సేకరించనున్నారు. భువనగిరి పరిధిలోని భూముల విషయంలో గతంలో కొంత కాలంపాటు హైకోర్టు స్టే ఉండడంతో భూ సేకరణ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఆ తర్వాత హైకోర్టు స్టేను ఎత్తేయడంతో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు.

### 26హెక్టార్లకు త్రీజీ విడుదల..

ట్రిపుల్ ఆర్‌లో భాగంగా భువనగిరి మండలంలోని గౌస్‌నగర్, కేసారం, యెర్రంబల్లి, తుక్కాపూర్, పెంచికల్‌పహాడ్, రాయగిరి గ్రామాల్లో భూమిని తీసుకోనున్నారు. గతంలో త్రీడీ నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం 96హెక్టార్లు సేకరించనున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 22న 70 హెక్టార్లకు త్రీజీ నోటిఫికేషన్ విడుదల చేశారు. అప్పుడు ఆయా గ్రామాల వారీగా ఆర్డీఓ కార్యాలయంలో సమావేశాలు ఏర్పాటు చేశారు. కానీ ఎక్కువ శాతం మంది రైతులు బహిష్కరించారు. తాజాగా మిగిలిన 26 హెక్టార్లకు త్రీజీ నోటిఫికేషన్ జారీ చేశారు.

### తగ్గేది లేదంటున్న నిర్వాసితులు..

ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చేదే లేదని, అలైన్ మెంట్ మార్చాలని నిర్వాసితులు చెబుతున్నారు. ప్రధానంగా రాయగిరి రైతులు రణం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంత రైతులు పలు సందర్భాల్లో తమ భూములను కోల్పోవాల్సి వచ్చింది. వైటీడీఏ విస్తరణ, హైటెన్షన్ వైర్లు, జాతీయ రహదారి నిర్మాణం సమయంలో భూములను వదులుకున్నారు. దాంతో ఇక్కడి రైతులు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. జిల్లాలో ఎప్పటికప్పుడు ధర్నాలు నిర్వహిస్తూనే ఉన్నారు. అలైన్ మెంట్ మారుస్తామని అనేక సందర్భాల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడంపై భూనిర్వాసితులు మండిపడుతున్నారు.

### సమావేశాల షెడ్యూల్..

భువనగిరి మండలంలోని ఆరు గ్రామాల మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్తున్నది. ఆయా చోట్ల 118.188 కిలోమీటర్ల నుంచి 133.178 కిలోమీటర్ల వరకు రహదారి నిర్మించనున్నారు. త్రీజీ నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో ఆయా గ్రామాల నిర్వాసితులతో ఆర్డీఓ సమావేశాలు నిర్వహించనున్నారు. కోల్పోతున్న వ్యవసాయ భూమి లేదా ఖాళీ ప్లాట్ విస్తీర్ణం వివరాలను నిర్వాసితులు అధికారులకు అందించాలి. అదే విధంగా వాటిలోని ఇండ్లు, బాయి, బోరు, చెట్లు, ఇతర నిర్మాణాలకు సంబంధించిన వివరాలను కూడా సమర్పించాలి. వాటికి సంబంధించిన పత్రాలు, యజమాని ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను జత చేయాలి. అయితే ఈ నెల 27 నుంచి 30 వరకు భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో సమావేశాలు ఉండనున్నాయి. 27న ఉదయం 11గంటలకు గౌస్‌నగర్, మధ్యాహ్నం 2గంటలకు కేసారం, 28న ఉదయం 11గంటలకు ఎర్రంబెల్లి, మధ్యాహ్నం తుక్కాపూర్, 30న ఉదయం పెంచికల్‌పహాడ్, మధ్యాహ్నం రాయగిరి నిర్వాసితులతో మీటింగ్ ఉండనుంది. కాగా, ఈసారి కూడా సమావేశాలకు నిర్వాసితులు హాజరయ్యే అవకాశాలు కనిపించడం లేదు.